ఆంధ్రజ్యోతి


***

ANDHRAJYOTHY

నల్లగొండ

5

శనివారం 8 జూన్ 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.174	270	300
సూర్యాపేట	రూ.172	242	272
నల్లగొండ	రూ.172	240	270

ఉష్ణోగ్రత గరిష్ఠం 37.0 | కనిష్ఠం 24.0

ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ తీన్మార్

అత్యంత ఉత్కంఠగా సాగిన శాసనమండలి నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజ యం సాధించారు. ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు అనంతరం సమీప ప్రత్యర్థి బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగు రాకేష్‌రెడ్డి కంటే మల్లన్నకు ఎక్కువ ఓట్లు రావడంతో విజేతగా అధికారులు నిర్ణయించారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)



విజయ సంకేతం చూపుతున్న తీన్మార్ మల్లన్న

చివరి వరకు ఉత్కంఠగా సాగిన లెక్కింపు

మూడో ప్రయత్నంలో తీన్మార్ మల్లన్నకు దక్కిన విజయం

అన్ని రౌండ్లలో ఆయనదే ఆధిక్యత

నల్లగొండ జిల్లా కేంద్రంలో మూడు రోజుల పాటు సాగిన ఓట్ల లెక్కింపులో ప్రతి రౌండ్‌లోనూ కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్న ఆధిక్యత చాటగా, బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి సైతం బలమైన పోటీ ఇచ్చారు. చివరి వరకు కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల నడుమ పోటాపోటీ ఉత్కంఠగా సాగింది. అశోక్‌కుమార్ మినహా మిగిలిన స్వతంత్ర అభ్యర్థులు 48మంది ఎలిమినేషన్‌లో ద్వితీయ ప్రాధాన్య ఓట్లు తీన్మార్ మల్లన్న, రాకేశ్‌రెడ్డికి దాదాపు సమానంగా ఓట్లు వచ్చాయి. మొత్తం 57మంది అభ్యర్థుల్లో రాత్రి 10గంటలవరకు అధికారికంగా ప్రకటించిన ప్రకారం మొదటి 47 మంది స్వతంత్ర అభ్యర్థుల బ్యాలెట్ల నుంచి వచ్చిన ద్వితీయ ప్రాధాన్య ఓట్లను కలుపుకొని కాం గ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు 1,24,899 ఓట్లు రాగా, బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి 1,05,524 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికి 43,956, స్వతంత్ర అభ్యర్థి పాలకూ రి అశోక్‌కుమార్‌కు 30,461 ఓట్లు వచ్చాయి. అశోక్, ప్రేమేందర్‌రెడ్డి ఎలిమినేషన్ తరువాత కూడా మల్లన్నకే ఆధిక్యత ఉన్నా, కోటా ఓట్లు రాకపోవడంతో ఎన్నికల సంఘం అనుమతి మేరకు ఆయన్ను విజేతగా ప్రకటించే ప్రక్రియను రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన చేపట్టారు.

ఎవ్వరికీ రాని కోటా ఓట్లు

మొదటి ప్రాధాన్యంలో 29,697 ఓట్లు సాధించిన కీలక స్వతంత్ర అభ్యర్థి అశోక్‌కుమార్ ఎలిమినేషన్‌లో ద్వితీయ ప్రాధాన్య ఓట్లు కూడా ప్రధాన అభ్యర్థుల్లో ఎవ్వరికీ ఏకపక్షంగా రాలేదు. ఆయన ఎలిమినేషన్ తర్వాత బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని ఎలిమినేట్ చేసి, ఆయన బ్యాలెట్లలో ద్వితీయ ప్రాధాన్య ఓట్లను లెక్కించారు. ఆయనకు వచ్చిన 43,313 బ్యాలెట్లలో ద్వితీయ ప్రాధాన్యతలోనూ పోటాపోటీగా ఇద్దరు అభ్యర్థులకు ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి బీజేపీ క్యాడర్‌తో సన్నిహిత సంబంధాలు ఉండటంతోపాటు ఆయన ఇటీవల వరకు బీజేపీలో క్రియాశీలకంగా పనిచేశారు. ఈ నేపథ్యంలో బీజేపీకి మొదటి ప్రాధాన్యత ఓటేసిన ఓటర్లలో సింహభాగం ద్వితీయ ప్రాధాన్య ఓటు రాకేష్‌రెడ్డికి వేస్తారని భావించినా, వారి అంచనాలు తలకిందులయ్యాయి. బీజేపీ అభ్యర్థి ఎలిమినేషన్‌లోనూ కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్నకు ద్వితీయ ప్రాధాన్య ఓట్లు గణనీయంగా రావడంతో ఆధిక్యత కొనసాగింది. అయితే బీజేపీ అభ్యర్థి ఎలిమినేషన్ తర్వాత కూడా కోటా ఓటు ఎవ్వరికీ రాలేదు.



విజేత ప్రకటనపై చర్చిస్తున్న ఆర్వో హరిచందన

2021 మాదిరిగానే చివరి వరకు ఉత్కంఠ

ఇదే స్థానానికి 2021లో జరిగిన ఎన్నికలోనూ తీవ్ర ఉత్కంఠ కొనసాగింది. ఆ ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థి తీన్మార్ మల్లన్న, తెలంగాణ జనసమితి అభ్యర్థి ప్రొఫెసర్ కోదండరామ్, బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ అభ్యర్థి రాములు నాయక్, సీపీఐ అభ్యర్థి జయసారధిరెడ్డి, యువతెలంగాణ పార్టీ నుంచి రాణిరుద్రమరెడ్డి తదితరులు పోటీచేశారు. వారిలో ప్రేమేందర్‌రెడ్డి నాలుగో స్థానంలో ఉండగా, ఆయన ఎలిమినేషన్ తర్వాత కూడా మొదటి, రెండో స్థానాల్లో ఉన్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి (బీఆర్ఎస్), స్వతంత్ర అభ్యర్థి తీన్మార్ మల్లన్నల్లో ఎవ్వరికీ కోటా ఓటు రాలేదు. మూడో స్థానంలో ఉన్న ప్రొఫెసర్ కోదండరామ్‌ను ఎలిమినేట్ చేసి ఆయనకు వచ్చిన ద్వితీయ ప్రాధాన్య ఓట్లను లెక్కించారు. కోటా ఓటుకు పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేరడంతో ఆయన్ను ఎమ్మెల్సీగా ప్రకటించారు. ఆ ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన మల్లన్నే, ప్రస్తుత ఉపఎన్నికలో కాంగ్రెస్‌నుంచి బరిలో దిగి,తీవ్రపోటీలోనూ సంచలన విజయం నమోదు చేశారు.

అన్ని రౌండ్లలోనూ ఆధిక్యతే

ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో అన్ని రౌండ్లలోనూ మల్లన్నకు ఓట్ల ఆధిక్యత వచ్చింది. మొత్తం 4,63,839 ఓట్లకు 3,36,013 ఓట్లు పోలయ్యాయి. వాటిలో 25,824 ఓట్లు చెల్లకుండా పోగా, 3,10,189 ఓట్లు చెల్లాయి. కోటా ఓట్లు 1,55,095 కాగా, మొదటి ప్రాధాన్యంలో ఎవ్వరికీ కోటా రాక పోవడంతో ద్వితీయ ప్రాధాన్య ఓట్లను లెక్కించారు. మొదటి ప్రాధాన్య ఓట్లలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు 1,22,813 ఓట్లు వస్తే, బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి 1,04,248 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికి 43,313, స్వతంత్ర అభ్యర్థి అశోక్‌కుమార్‌కు 29,967 ఓట్లు వచ్చాయి. ద్వితీయ ప్రాధాన్య ఓట్లలోనూ అశోక్‌కుమార్ సహా స్వతంత్ర అభ్యర్థులందరి ఓట్లలో మల్లన్నకే ఎక్కు రాగా, బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి ఓట్లలోనూ బీఆర్ఎస్ అభ్యర్థికి దీటుగా మల్లన్న ఓట్లు రాబట్టారు. దీంతో మల్లన్న గెలుపునకు మార్గం సుగమమైంది.

మూడో ప్రయత్నంలో ఎమ్మెల్సీగా

జర్నలిస్టుగా, ప్రశ్నించే గొంతుకగా చిరపరిచితుడైన తీన్మార్ మల్లన్న ఎట్టకేలకు మూడో ప్రయత్నంలో ఎమ్మెల్సీగా విజయం సాధించారు. 2015లో ఆయన మొదటిసారి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచి ఓటమిపాలయ్యారు. ఆతర్వాత 2021లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగి బీఆర్ఎస్‌కు బలమైన పోటీ ఇచ్చారు. మూడో ప్రయత్నంలో ప్రస్తుత ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచి విజయం సాధించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో నేరుగా కొట్లాడిన క్రమం లో మల్లన్నపై 59వరకు కేసులు నమోదయ్యాయని, ప్రశ్నిం చే గొంతుకగా పోరాడిన మల్లన్న గెలుపు స్ఫూర్తిదాయకమని కాంగ్రెస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు.

● సాంకేతికంగా ఓడినా నైతిక విజయం నాదే



ఎమ్మెల్సీగా తాను సాంకేతికంగా ఓడినా, నైతికంగా తనదే గెలుపని బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. చట్టసభల్లో అడుగుపెట్టలేకపోయినా, తాను జనసభలో ప్రజల తరుపున ప్రభుత్వంతో పోరాడుతానని ప్రకటించారు. తన గెలుపుని అన్ని రాజకీయ పార్టీలవారు కోరుకున్నారని, జేడీలక్ష్మీనారాయణవంటి మేధావులు తనకు మద్ధతునిచ్చారని, వారందరికీ కృతజ్ఞతలని తెలిపారు. 12ఏళ్లుగా ప్రజల కోసం నిచేస్తున్నానని, బీఆర్ఎస్ శ్రేణులు ఎన్నికలో పోరాటపటిమ చూపారని కొనియాడారు. తన ఊపిరి ఉన్నంతవరకు పట్టభద్రుల తరుపున ప్రజాక్షేత్రంలో పోరాడుతానని పేర్కొన్నారు.

రాకేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి

ధాన్యం కొనుగోళ్లు పూర్తి

ఉమ్మడి జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి. ఈ సారి ఉమ్మడి జిల్లాలో యాదాద్రి జిల్లా యంత్రాంగం రికార్డు స్థాయిలో 3,37,3676 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించింది. ఆ తరువాత స్థానంలో నల్లగొండ, సూర్యాపేట జిల్లాలు ఉన్నాయి. వానాకాలం సీజన్ ప్రారంభం కాకముందే జూన్ మొదటివారంలోనే ధాన్యం కొనుగోళ్లు పూర్తవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. అంతేగాక వానాకాలం సీజన్ వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.

- (ఆంధ్రజ్యోతి, యాదాద్రి)/ నల్లగొండ



- ఉమ్మడి జిల్లాలో 8.88లక్షల మెట్రిక్‌టన్నుల సేకరణ
- అత్యధికంగా యాదాద్రి జిల్లాలో రికార్డు స్థాయిలో 3.37లక్షల మెట్రిక్ టన్నులు
- ఇప్పటి వరకు రూ.1,788కోట్లు రైతులకు చెల్లింపు
- పెండింగ్‌లో రూ.150కోట్లు
- త్వరలో విడుదలయ్యే అవకాశం

ఉమ్మడి జిల్లాలో కోతుల బెడద అధికంగా ఉండటంతో యాసంగిలో ఆరుతడి పంటల రైతులు వరి సాగుకే మొగ్గు చూపుతారు. వ్యవసాయ, బోరుబావుల ఆధారంగా ఈ ఏడాది అధికంగా వరి సాగైంది. రైతుల నుంచి మద్దతు ధరకు ధాన్యం సేకరణకు ఉమ్మడి జిల్లాలో మొత్తం 987 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. నల్లగొండ జిల్లాలో 370 ధాన్యం కొనుగోలు కేంద్రాలు, యాదాద్రి జిల్లాలో 323, సూర్యాపేట జిల్లాలో 294 కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఈ కేంద్రాల ద్వారా మొత్తం 8,88,148మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికార యంత్రాంగం సేకరించింది.

● నల్లగొండ జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ గత నెల మూడో వారంతో ముగిసింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 370 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. మార్చి మొదటి వారం తరువాత ధాన్యం కొనుగోళ్ల ప్రారంభం కాగా, ఇప్పటి వరకు మొత్తం రూ.644 కోట్ల మేర రైతుల ఖాతాల్లో నగదు జమైంది. జిల్లాలో 5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం లక్ష్యానికి 3,10,250మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. మిగతా ధాన్యాన్ని రైతులు మిల్లర్లకు విక్రయించినట్లు సమాచారం. కాగా, ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైతులకు రూ.668కోట్లకు రూ.644 కోట్లు చెల్లించారు. ఇంకా రూ.24కోట్లు చెల్లించాల్సి ఉంది.

● సూర్యాపేట జిల్లాలో మొత్తం 294ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయగా, రూ.529.89కోట్ల విలువైన 2,40,531 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. కాగా, రైతులకు ఇప్పటి వరకు రూ.524.49కోట్లు చెల్లించారు. ఇంకా రూ.5.40కోట్లు చెల్లించాల్సి ఉంది. మొత్తం 83,125మంది రైతుల ధాన్యం కొనుగోలు చేయగా, 42,954 మందికి చెల్లింపులుచేశారు. ఇంకా 40,171 మందికి నగదు చెల్లింపు చేయాల్సి ఉంది.

రూ.1,938.9కోట్లు విలువైన ధాన్యం కొనుగోలు

ఉమ్మడి జిల్లాలో యాసంగిలో రూ.1,938.9కోట్ల విలువైన 8,88,148 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు.యాదాద్రి జిల్లాలో యాసంగిలో 2.50లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని, 5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుమతి అవుతుందని, కొనుగోలు కేంద్రాలకు 4.11లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలుకేంద్రాల ద్వారా 3,37,367 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు.ఇప్పటివరకు 3,37,445 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైస్ మిల్లులకు ఎగుమతిచేశారు. ఇంకా 231.360మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు తరలించాల్సి ఉంది. మొత్తం 35,865 మంది రైతుల వద్ద రూ.741.01కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు రూ.620.06కోట్ల మేరకు రైతులకు చెల్లింపులు చేశారు.

● ఉమ్మడి జిల్లాలో 987 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రూ.1,938.9కోట్ల విలువైన 8,88,148మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు రైతుకు రూ.1,788.55 కోట్లు చెల్లించగా, ఇంకా రూ.150.35కోట్లు చెల్లించాల్సి ఉంది.

'ఆన్‌లైన్'తో చెల్లింపులు సులువుగా

ధాన్యం విక్రయించిన మిగతా రైతులకు కూడా త్వరలోనే నేరుగా బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయనున్నారు.ధాన్యం సేకరణ పారదర్శకంగా ఉండేందుకు రైతుల వివరాలను 'ఆన్‌లైన్'లో పొందుపరిచారు. ఏ మండలాల్లో ఎంతమంది రైతులు ఉన్నారన్న సమాచారంతో పాటు, రైతుల భూములకు సంబంధించిన సర్వే నెంబర్లు సహా సెంటర్‌ఫర్ గుడ్ గవరెన్స్ (సీజీజీ) సహకారంతో ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేశారు. రైతుల వివరాలను కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు. ధాన్యం విక్రయించే రైతుల నుంచి ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా నెంబర్ సేకరించారు. దీంతో రైతులు కొనుగోలు కేంద్రాలకు పట్టా పాస్‌పుస్తకాల జీరాక్స్ కాపీలను తీసుకెళ్లాల్సిన పని తప్పింది. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు పౌరసరఫరాలశాఖ ట్యాబ్‌తో పాటు ప్రింటర్లను కూడా పంపిణీ చేసింది. రైతుల వద్ద ధాన్యం సేకరించగానే రోజువారీగా ఎంతమేరకు కొనుగోలు చేశారనే వివరాలను ట్యాబ్‌లలో నమోదు చేశారు. కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలు పంపిన వివరాలను పౌరసరఫరాలశాఖ మేనేజర్ పరిశీలించి, అన్ని సరిగ్గా ఉన్న పక్షంలో ఆన్‌లైన్‌లో డిజిటల్ సంతకంతో ఆమోదించగానే నేరుగా రైతుల బ్యాంకుఖాతాల్లోకి ధాన్యం డబ్బులు జమయ్యాయి.

ధాన్యం కొనుగోళ్లు పూర్తి



యాసంగిలో ధాన్యం కొనుగోలుకు 323 కేంద్రాలను ఏర్పాటుచేశాం. ఈసారి ముందస్తుగానే కొనుగోళ్లు పూర్తి చేశాం. ఇప్పటివరకు జిల్లాలో 3.37లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని, 35,865 మంది రైతుల నుంచి సేకరించాం. రైతులకు చెల్లించాల్సిన మొత్తం రూ.741కోట్లకు రూ.620.06కోట్ల మేరకు చెల్లించాం. మిగతా రైతుల డబ్బును కూడా త్వరలో వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నాం. ఈ సారి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో యాదాద్రి జిల్లా అత్యధికంగా ధాన్యాన్ని సేకరించడంతోపాటు, జూన్ మొదటి వారంలోపే కొనుగోళ్లను పూర్తి చేశాం.

- గోపికృష్ణ, యాదాద్రి జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్



ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు
షెడ్యూల్ విడుదల

నేటి నుంచి ప్రక్రియ ఆరంభం



నల్లగొండ, జూన్ 7 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు మోక్షం కలిగింది. శనివారం నుంచి ఈ ప్రక్రియను ప్రారంభించాలని విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో శనివారం నుంచి బదిలీలు, పదోన్నతులకు ప్రక్రియ ప్రారంభం కానుంది. మల్టీజోన్-2 పరిధిలోకి వచ్చే ఉమ్మడి జిల్లాలో ఈనెల 8 నుంచి 30వ తేదీ వరకు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ కొనసాగనుంది. మొత్తం 23 రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. గత ఏడాది మల్టీజోన్-1లో రంగారెడ్డి జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు కోర్టును ఆశ్రయించడంతో అప్పట్లో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు బ్రేక్‌పడింది. ఆ సమయంలో ఆగిన ప్రక్రియ నుంచి తాజా ప్రక్రియను కొనసాగిస్తామని విద్యాశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది. మూడేళ్లలోపు పదవీ విరమణ పొందనున్న ఉపాధ్యాయులకు తప్పనిసరి బదిలీ నుంచి మినహాయింపు ఇచ్చారు. ల్యాంగ్వేజ్ పండిట్, పీఈటీ పోస్టుల అప్‌గ్రేడేషన్ కూడా ఈ షెడ్యూల్‌లో పూర్తిచేయనున్నారు. మృతిచెందిన ఉపాధ్యాయులు, ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుల జాబితాను ఉన్నతాధికారులకు ఆయా జిల్లాల డీఈవోలు నివేదించారు. దీంతో కొత్త సీనియారిటీ జాబితాలను రూపొందించి ఉపాధ్యాయ బదిలీ, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభించనున్నారు. కాగా ఇప్పటి వరకు ఉన్న సమాచారం మేరకు మల్టీజోన్-2లో ఉన్న నల్లగొండ జిల్లాలో జీహెచ్ఎం పోస్టులు 109, సూర్యాపేట జిల్లాలో 102, యాదాద్రి జిల్లాలో 83 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

మూసీ నుంచి తరలుతున్న ఇసుక

● రోజూ వందలాది లారీల రాక ● ఎమ్మెల్యే మాట నిలబెట్టుకోవాలంటున్న ప్రజలు

● ప్రభుత్వ అవసరాలకే అంటున్న ఎమ్మెల్యే సామేల్

●7లో..

జంట నగరాలకు నిరంతరం నీటి సరఫరా

జెన్‌కో సీఈ మహేష్‌కుమార్

యాదాద్రిలో వైభవంగా ఊంజల్ సేవ

నృసింహుడికి స్వర్ణపుష్పార్చన

●6లో..

నేడు మృగశిర కార్తె

ముమ్మరంగా చేపల విక్రయాలు



మార్కెట్‌లో చేపలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

నల్లగొండ కల్చరల్, జూన్ 7: మృగశిర కార్తె శనివారం కావడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చేపల మార్కెట్లలో సందడి నెలకొంది. మృగశిర కార్తె రోజున చేపలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యమని ప్రజల నమ్మకం. శుక్రవారం అన్ని వర్గాల ప్రజలు స్థోమతకు తగినట్టు మార్కెట్లలో చేపలను కొనుగోలు చేశారు. డిమాండ్‌కు అనుగుణంగా వ్యాపారులు సైతం పెద్దమొత్తంలో చేపలను ఇప్పటికే దిగుమతి చేసుకుని నిల్వ చేశారు. చేపలకు డిమాండ్ ఏర్పడటంతో ధర కూడా పెంచి విక్రయిస్తున్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రకాశంబజార్, పానగల్ బైపాస్ రోడ్డు, దేవరకొండ రోడ్డు, మిర్యాలగూడ రోడ్డు, బస్టాండ్, రామగిరి, హైదరాబాద్ రోడ్డు తదితర ప్రాంతాల్లో వ్యాపారులు రహదారుల వెంట చేపలను కుప్పలుగా పోసి విక్రయిస్తున్నారు. సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, భువనగిరి, ఆలేరు, చౌటుప్పల్, మోత్కూరు, తదితర ప్రాంతాల్లో చేపల విక్రయాలు జోరుగా జరిగాయి. బొచ్చ, రవ్వ కిలో రూ.180 నుంచి రూ.200వరకు, పాంప్లెట్లు చిన్న సైజువి రూ.50 నుంచి రూ.60 వరకు, పెద్దసైజువి రూ.80 నుంచి రూ.100 వరకు, బురదమట్టలు రూ.400 నుంచి రూ.450 వరకు, కొర్రమేను రూ.500 నుంచి రూ.700 వరకు, రొయ్యలు రూ.400 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉండటంతో చెరువుల్లో చేపల పెంపకం తగ్గింది. దీంతో చేపల ఉత్పత్తి కూడా కొద్దిగా తగ్గింది. నల్లగొండ జిల్లాకు తుమ్మలగూడెం, మిర్యాలగూడ, అడవిదేవులపల్లి, పానగల్లు ఉదయసముద్రం, నాగార్జునసాగర్, డిండి, మూసీ తదితర చెరువులతో పాటు గుంటూరు, బాపట్ల, తెనాలి తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు చేపలను దిగుమతి చేసుకున్నారు.

పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి



పీడీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఉపాధి హామీ కార్మికులు

నల్లగొండరూరల్, జూన్ 7: ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్లు కేటాయించి, పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారీ ఐలయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నో పోరాటాల ఫలితంగా తెచ్చుకున్న ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నీరుగార్చి, నిర్వీర్యం చేస్తోందన్నారు. ఈ చట్టాన్ని రక్షించుకునే బాధ్యత ఉపాధి కార్మికులపై ఉందన్నారు. ప్రతీ కుటుంబానికి 200 రోజులు పని కల్పిస్తూ, పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కూలీలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం పీడీకి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల జిల్లా కన్వీనర్ దండంపల్లి సరోజ, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.లింగస్వామి, అనందు, రవి, రాములు, తదితరులు పాల్గొన్నారు.



డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కేవీపీఎస్ నాయకులు

బీఏఎస్ స్కీంలో అడ్మిషన్లు ఇప్పించాలి

నల్లగొండ రూరల్, జూన్ 7: బెస్ట్ అవైలబుల్ స్కీం కింద పేద విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలలో అడ్మిషన్లు ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున డిమాండ్ చేశారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో స్థానిక డీఈవో కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సౌకర్యాలు పొందుతూ దళిత, గిరిజన విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలు సీట్లు కేటాయించడం లేదన్నారు. కొన్ని ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రభుత్వ వేతనాలు పొందుతూ విద్యార్థుల నుంచి ఫీజు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అలాంటి పాఠశాలలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అధికారులు వెంటనే స్పందించి వారిపై చట్టపర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కలెక్టర్ స్పందించి జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి బెస్ట్ అవైలబుల్ స్కీం కింద సీట్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కమిటీ నాయకులు కొండేటి శ్రీను, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవ

భువనగిరి అర్బన్, జూన్ 7 : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి సన్నిధిలో శుక్రవారం స్వామి వారికి శుక్రవారం స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవం జరిపారు. ఆగమశాస్త్ర రీతిలో వేడుకలు నిర్వహించిన పూజారులు వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభూవులను మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తలసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. అనుబంధ శివాలయంలో శ్రీరామలింగేశ్వరస్వామి వారికి నిత్యపూజలు, యాగశాలలో చండీహోమం, శైవాగమపద్ధతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకస్వాములు ప్రాకార మండపంలోని అద్దాల మండపంలో ఊయలలో అధిష్ఠింపజేశారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నిరాజనాల మధ్య ఊంజళ్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ.32,70,834ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా, ప్రతీ వారం జరిగే ధార్మిక,సాహిత్య, సంగీత సభల్లో భాగంగా జనగాంకు చెందిన చంద్రకళ నిలయం ఆధ్వర్యంలో కళాకారులు పేరిణి నృత్యం ప్రదర్శన చేశారు.


అద్దాల మండపంలో అమ్మవారికి ఊంజల్ సేవ నిర్వహిస్తున్న పూజారులు

కుండపోత వర్షంతో రోడ్డుపై వరద


తిరుమలగిరి(సాగర్) సమీపంలో వరద నీరు పారుతుండడంతో నిలిచిన రాకపోకలు

● సుమారు గంటన్నరపాటు రాకపోకలకు అంతరాయం

తిరుమలగిరి(సాగర్), జూన్ 7: నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మండలంలోని రంగుండ్ల, గాత్‌తండా, తూటిపేటతండా, తిరుమలగిరి(సాగర్) గ్రామాల్లో రహదారులపైకి వరద నీరు పోటెత్తింది. సుమారు గంటకు పైగా పెద్దఎత్తున వర్షం కురవడంతో పొలాల మీదుగా వరద నీరు మండల కేంద్రానికి సమీపంలోని మెయిన్ రోడ్డుపై సుమారు 3 ఫీట్ల మేర పొంగిపొర్లింది. దీంతో మండల కేంద్రానికి, కొంపల్లి, రాజవరం, డొక్కలబావి తండా చుట్టుపక్కల గ్రామాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

శాలిగౌరారం ప్రాజెక్టుకు జలకళ

శాలిగౌరారం, జూన్ 7: నల్లగొండ జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టులో ఒకటైన శాలిగౌరారం ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 21 అడుగులకు శుక్రవారం సాయంత్రం 17 అడుగులకు చేరుకుంది. ప్రాజెక్టు పూర్తిగా నిండినప్పుడు ప్రాజెక్టుకు కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా రెండు సీజన్లకు 6 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ప్రాజెక్టు చివరి భూముల వరకు పంట కాల్వల, షట్టర్లు శిథిలం కావడంతో పూర్తిస్థాయిలో సేద్యం కావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్టును పూర్తిగా ఆధునీకరించి చివరి భూముల వరకు కాల్వలను పటిష్ఠంగా నిర్మించాలని రైతులు కోరుతున్నారు.


శాలిగౌరారం ప్రాజెక్టులో నీటినిల్వ

మురుగుకాల్వలో పడి మతిస్థిమితం లేని మహిళ మృతి

దేవరకొండ, జూన్ 7: నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు సమీపంలోని డ్రైనేజీ కాల్వలో పడి మతిస్థిమితం లేని మహిళ మృతి చెందింది. శుక్రవారం సీఐ నర్సింహులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాంపల్లి మండలం లింగోటం గ్రామానికి చెందిన దుబ్బ శోభ(45)కు వివాహంకాగా భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆమె రెండేళ్లుగా మతిస్థిమితంకోల్పోయి అక్కడక్కడ గ్రామాలు, బంధువుల ఇళ్లకు తిరుగుతుంటుంది. గురువారం దేవరకొండకు చేరుకుంది. రాత్రి మార్కెట్ సమీపంలోని డ్రైనేజీ కాల్వలో పడి మృతి చెందింది. శుక్రవారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ నర్సింహులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే శోభ కనిపించడంలేదని వెతుకుతున్న కుటుంబసభ్యులు దేవరకొండకు చేరుకొని మృతదేహాన్ని గుర్తించారు. శోభ కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

డిండి, జూన్ 7: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నట్లు నల్లగొండ జిల్లా డిండి ఎస్‌ఐ రాజు శుక్రవారం తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునూతల మండలం తిరుమలహర్‌కు చెందిన ట్రాక్టర్‌డ్రైవర్లు రాసమళ్ల అంజనేయులు, వంగూరు మండలం తిప్పారెడ్డిపల్లికి చెందిన తూళ్ల శ్రీనివాసులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

రామన్నపేట, జూన్ 7: విద్యుదాఘాతంతో రెండు పాడిగేదెలు మృత్యువాతపడ్డాయి. యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన రైతు చిల్ల వెంకటయ్యకు చెందిన ఐదు గేదెలు మేతకు వెళ్లాయి. ఈ క్రమంలో సాయంత్రం మూడు గేదెలు తిరిగి వచ్చాయి. మిగతా గేదెలు రాకపోవడంతో వెంకటయ్య వెతికినా రాత్రి వరకు వాటి జాడ దొరకలేదు. అయితే వెంకటయ్యకు చెందిన గేదెలు మునిపంపుల గ్రామశివారు పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. శుక్రవారం స్థానికుల సమాచారం మేరకు వెంకటయ్య వెళ్లి పరిశీలించి తన గేదెలుగా గుర్తించాడు. గేదెల విలువ రూ.2లక్షలు ఉంటుందని, తనను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరారు.

రేషన్‌బియ్యం పట్టివేత

మిర్యాలగూడ రూరల్, జూన్ 7 : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం బాదలాపురంలో నిల్వ ఉంచిన 7క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బంటు కృష్ణ తన ఇంట్లో రేషన్ బియ్యం నిల్వ ఉంచాడన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించగా 15 బస్తాల్లో ఏడు క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. కృష్ణ, అతడి సోదరుడు బంటు వెంకటేశ్వర్లు గ్రామాల్లోని లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



హాలియా : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షిని కలిసిన నూతనంగా ఎన్నికైన నల్లగొండ, భువనగిరి ఎంపీలు కుందూరు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

మూసీ నుంచి తరలుతున్న ఇసుక

- రోజూ వందలాది లారీల రాక
- ఎమ్మెల్యే ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలంటున్న ప్రజలు
- ప్రభుత్వ అవసరాలకే అంటున్న ఎమ్మెల్యే సామేల్
- ప్రైవేటు వ్యక్తులపై చర్యలు తప్పవంటున్న ఎమ్మెల్యే

మోత్కూరు, జూన్ 7: అసెంబ్లీ ఎన్నికలకు ముందు తుంగతుర్తి నియోజకవర్గంలోని బిక్కేరు వాగు, మూసీనది నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుండేది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఈ నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణానే ప్రధాన ప్రచార అస్త్రంగా కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేసుకుంది. అప్పటి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ కనుసన్నల్లోనే ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని, దోసెడు ఇసుక తీస్తే దోసెడు నీరు తగ్గుందని, కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన ప్రస్తుత ఎమ్మెల్యే సామేల్ ఆనాడు ఎన్నికల సభల్లో ప్రచారంచేశారు. దీంతో అసెంబ్లీ ఎన్నికల సందడి మొదలైన నాటి నుంచి నియోజకవర్గం నుంచి ఇసుక తరలింపు నిలిచిపోయింది. ఇసుక తరలింపుపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకత కాంగ్రెస్ అభ్యర్థి సామేల్ విజయానికి దోహదపడింది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆగిన ఇసుక అక్రమ రవాణా పార్లమెంటు ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే తిరిగి ప్రారంభమైందని పలువురు విమర్శిస్తున్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలోని శాలిగౌరారం మండలం వంగమర్తి నుంచి మూడు రోజులుగా రోజూ వందలాది లారీల్లో ఇసుక తరలిస్తున్నారని ప్రజలు, రైతులు చెబుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇసుక తీస్తే తప్పు, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో తీస్తే ఒప్పు అవుతుందా అని ప్రశ్నిస్తున్నారు. వంగమర్తి బ్రిడ్జి సమీపంలోనే ఇసుక తీస్తున్నారంటున్నారు. ఎక్స్‌కవేటర్లతో తీసి రాశులు పోసి, రోజూ వందలాది లారీల్లో తరలించడం వల్ల భూగర్భ జలాలు తగ్గి బోర్లు, బావుల్లో నీరు దొరకకుండా పోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. బ్రిడ్జికి సమీపంలో ఇసుక తోడటంతో బ్రిడ్జి కూడా దెబ్బతినే ప్రమాదముందంటున్నారు. ప్రభుత్వ అనుమతితో, ప్రభుత్వ అవసరాలకు ఇసుక తీసుకెళ్లుతున్నట్టు ఇసుక తరలిస్తున్న కాంట్రాక్టర్లు చెబుతున్నప్పటికీ కాంట్రాక్టర్ ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వెంటనే ఇసుక అక్రమ రవాణాను ఆపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



మూసీ నుంచి ఇసుక తీసుకెళ్లడానికి వెళుతున్న లారీలు

ఎమ్మెల్యే సామేల్ మాట నిలబెట్టుకోవాలి



శాలిగౌరారం మండలం వంగమర్తి మూసీనది నుంచి రోజూ వందల లారీల్లో ఇసుక తరలిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఏ పరిస్థితుల్లోనూ ఇసుక తరలించనివ్వనని సామేల్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. అప్పటి ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ ఇసుక తరలిస్తున్నాడని విమర్శించిన సామేల్ ఇప్పుడు ఎమ్మెల్యే అయ్యాక ఆయన చేస్తున్నది అదే కదా అని ప్రజలంటున్నారు. ఇసుక తరలింపుతో మూసీలోని రైతుల బోర్లు దెబ్బతింటాయి. పరిసర ప్రాంతాల బోర్లు, బావుల్లో భూగర్భ జలాలు తగ్గి రైతులు ఉపాధి కోల్పోతారు. వెంటనే ఇసుక తరలింపును ఆపాలి.

\- నారగోని అంజయ్య, రైతు, లక్ష్మీదేవికాల్వ మాజీ సర్పంచ్

ప్రభుత్వ అవసరాలకు తీసుకు వెళుతున్నారు



ప్రభుత్వఅనుమతితో యాదాద్రి థర్మల్ ప్లాంటు, ఖమ్మం మున్నేరు వాగు సేఫ్టీవాల్ నిర్మాణానికి (ప్రభుత్వ అవసరాలకు) ఇసుక తీసుకెళ్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇసుక తరలింపును అడ్డుకుంటానని చెప్పిన నేను ఆనాడే ప్రభుత్వ అవసరాలకు, ప్రభుత్వం అనుమతితో తీసుకెళ్తే అభ్యంతరం చెప్పలేదని కూడా చెప్పా. ప్రభుత్వం పేరు చెప్పి కాంట్రాక్టర్ ఇసుకను అక్రమంగా పట్టణాలకు తరలిస్తున్నట్టు నిరూపిస్తే తప్పకుండా అడ్డుకుంటా. బ్రిడ్జికి అరకిలోమీటరు దూరంగా పేరుకపోయిన ఇసుక పూడికను తీసుకెళ్లాలని సూచించా. బిక్కేరు వాగులో మాత్రం ఇసుక తీయనివ్వను. నేను ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నా.

\- మందుల సామేల్, ఎమ్మెల్యే, తుంగతుర్తి

డీజిల్ ట్యాంకర్ బోల్తా

బొమ్మలరామారం, జూన్ 7: యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలంలోని పెద్దపర్వతాపూర్ గ్రామ శివారులో డీజిల్ ట్యాంకర్ బోల్తా పడటంతో స్థానికులు డబ్బాలతో తీసుకువెళ్లారు. కర్ణాటక రాష్ట్రం నుంచి కేఏ 53 ఏఏ 6497 నెంబరు గల డీజిల్ ట్యాంకర్ బొమ్మలరామారం మండలం పర్వతాపూర్ గ్రామ శివారులో ఉన్న రీజెన్సీస్ కంపెనీకి బయలుదేరింది. శుక్రవారం మధ్యాహ్నం గ్రామ శివారులోని మూల మలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి డీజిల్ ట్యాంకర్ బోల్తా పడింది. ట్యాంకర్ రోడ్డుపక్క వైపు బోల్తా పడడంతో ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది కలగలేదు. ఈ ఘటనలో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. ట్యాంక్ నుంచి డీజిల్ లీక్ అవుతుండడంతో స్థానికులు డబ్బాలతో ట్యాంకర్ వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకుని దొరికినంత తీసుకెళ్లారు. మొత్తం 20వేల లీటర్ల డీజిల్ ఉండగా, 1000 లీటర్ల డీజిల్ స్థానికులు తీసుకువెళ్లారు. 1000 లీటర్లు వృథాగా పోయింది. విషయం తెలుసుకున్న రీజెన్సీస్ కంపెనీ సిబ్బంది క్రేన్ సహాయంతో డీజిల్ లారీని పక్కకు పెట్టారు. పోలీస్ సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



బోల్తాపడిన ట్యాంకర్ నుంచి డీజిల్‌ను పట్టుకుంటున్న స్థానికులు

గుండెపోటుతో డప్పు సుధాకర్ మృతి



సుధాకర్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు సామేల్, జగదీష్‌రెడ్డి



నాగారం, జూన్ 7 : తెలంగాణ రాష్ట్రోద్యమ కళాకారుడు, సాంస్కృతిక సారధి సభ్యుడు చిప్పలపల్లి(డప్పు) సుధాకర్(38) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. సూర్యాపేట జిల్లా నాగారం మండలకేంద్రానికి చెందిన సుధాకర్ అతడి నివాసంలో తెల్లవారుజామున గుండెపోటుకు గురై మృతి చెందారు. సుధాకర్‌కు భార్యతో పాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు. శనివారం అంత్యక్రియలకు ఏర్పాట్లుచేసినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.సుధాకర్ మృతి బాధాకరమని ఎమ్మెల్యేలు గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మందుల సామేల్ అన్నారు. సుధాకర్ కుటంబసభ్యులకు సామేల్ రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. నివాళులర్పించిన వారిలో ఎంపీపీ కురం మణివెంకన్న, జడ్పీటీసీ కడియం ఇందిరాపరమేశ్వర్, వైస్‌ఎంపీపీ గుంటకండ్ల మాణిమాల, గుండగాని అంబయ్య, చిప్పలపల్లి సోమయ్య, మల్లేష్, కాంగ్రెస్ నాయకులు మంగదుడ్ల దశరథ, మల్సూర్, వెంకటభిక్షం పాల్గొన్నారు.

సులభ సంపాదనకు సోదరుల చైన్‌స్నాచింగ్

భువనగిరి టౌన్, జూన్ 7: సులభ సంపాదనకు గొలుసు దొంగతనాలు చేస్తున్న ఇద్దరు సోదరులను యాదగిరిగుట్ట రూరల్ సర్కిల్ పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాచకొండ పోలీస్ కమిషనరేట్ యాదాద్రి జోన్ డీసీపీ రాజేష్‌చంద్ర ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. జనగాం జిల్లా దేవరుప్పల మండలం కడవెండి సీతారామపురం గ్రామానికి చెందిన సోదరులు నల్ల శ్రీకాంత్, నల్ల ప్రశాంత్ హైదరాబాద్‌లో నివాసం ఉంటూ ఒకరు ఫార్మా పరిశ్రమలో, మరొకరు ఓలా క్యాబ్ డ్రైవరుగా పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆశించిన స్థాయిలో ఆదాయం లభించడంలేదనే కారణంతో సులభ సంపాదన కోసం గొలుసు దొంగతనాలు (చైన్‌స్నాచింగ్) చేయాలని ప్రణాళిక రూపొందించుకున్నారు. ఈ మేరకు తమ ద్విచక్ర వాహనానికి నకిలీ నెంబర్ ప్లేట్ ఏర్పాటుచేసుకుని మార్చి 9న భువనగిరి మండలంలోని జమ్మాపురం, జూన్ 2న గుండాలలో ఒంటరిగా వెళ్తున్న ఇద్దరు మహిళల మెడలో నుంచి ఆరు తులాల రెండు బంగారు పుస్తెలతాళ్లను అపహరించారు. ఈ మేరకు బాధిత మహిళలు ఇచ్చిన వేర్వేరు ఫిర్యాదుల మేరకు అదే రోజున భువనగిరి రూరల్, గుండాల పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆ రెండు మార్గాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించటంతో పాటు, సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా దర్యాప్తు నిర్వహించారు. ఈ క్రమంలో శుక్రవారం భువనగిరిలో మరో చైన్‌స్నాచింగ్‌కు వస్తున్న నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. వారి నుంచి రూ.4.50లక్షల విలువైన ఆరు తులాల రెండు పుస్తెలతాళ్లు, రూ.50వేల విలువైన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో భువనగిరి ఏసీపీ రవికిరణ్‌రెడ్డి, యాదగిరిగుట్ట రూరల్ సీఐ కొండల్‌రావు, గుండాల ఎస్ఐ యాకన్న పాల్గొన్నారు. దొంగతనాల నివారణకు అందరు ఇళ్లు, దుకాణాల ముందు సీసీ కెమెరాలను ఏర్పాటుచేయాలని రాచకొండ పోలీస్ కమిషనరేట్ యాదాద్రి జోన్ డీసీపీ రాజేష్ చంద్ర సూచించారు. క్రిమినల్, చోరీ కేసుల దర్యాప్తుకు సీసీ కెమెరాలు కీలక ఆధారాలుగా మారుతున్నాయన్నారు. అలాగే నెంబరు ప్లేటు లేని వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేసులను ఛేదించిన పోలీసులకు నగదు రివార్డు అందజేశారు.



భువనగిరిలో వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రాజేష్‌చంద్ర

తుక్కాపురంలో రెండిళ్లలో చోరీ

- రూ.4.25 లక్షల సొత్తు అపహరణ
- వివాహిత మెడలో పుస్తెలతాడు చోరీకి యత్నం

భువనగిరి రూరల్, జూన్ 7:యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం తుక్కాపురంలో గురువారం రాత్రి రెండిళ్లలో చోరీజరిగింది. ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామశివారులో ఉంటున్న జనగాం చంద్రశేఖర్ తన కుటుంబసభ్యులతో కలిసి ఇంటిముందు ఆవరణలో నిద్రిస్తున్నారు. ఇంటి వెనక నుంచి ప్రవేశించిన దొంగలు ఇంట్లోని అల్మారాను 200మీటర్ల దూరంలోకి పొలాల్లోకి తీసుకెళ్లి బీరువాను ధ్వంసంచేశారు. అందులోని 22 తులాల వెండిపట్టాగొలుసులు, తులం బంగారు చెవికమ్మలు, రెండు తులాల బంగారు గుండ్లతాడుతో పాటుగా రూ.25వేల నగదును అపహరించుకుపోయారు. మొత్తం రూ.4.25 లక్షల సొత్తు చోరీ చేశారు. అనంతరం గ్రామానికి చెందిన గోపగాని నవీన్ ఇంటికి వెళ్లారు. ఆ ఇంటి వరండాలో భార్య ప్రసన్న కలిసి నవీన్ నిద్రిస్తున్నారు. ప్రసన్న మెడలోని నాలుగు తులాల బంగారు పుస్తెలతాడును లాక్కెళ్తుండగా ఆమె దొంగనను గట్టిగా పట్టుకొని కేకలు వేసింది. దీంతో చేయి విదిలించుకుని దొంగ పరారయ్యాడు. అతడి చేతిలోకి రెండువరుసల పుస్తెలతాడులో ఒకటిన్నర తులాల ఒక వరుస పుస్తెల తాడు వెళ్లింది. ఈ ఘటనపై శుక్రవారం సమాచారం అందుకున్న భువనగిరి రూరల్ సీఐ ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఐలు సంతోష్‌కుమార్, శివనాగప్రసాద్‌లు బాధితుల ఇళ్లను సందర్శించి దొంగతనాలు జరిగిన తీరును పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే 8712662472 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.

అల్మారాను పరిశీలిస్తున్న ఎస్ఐ



తాళంవేసి ఉన్న ఇంట్లో చోరీ

దేవరకొండ, జూన్ 7: నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలోని తాటికోలు రోడ్డు కొండల్‌రావునగర్‌లో వ్యాపారి సింగం జ్ఞానేశ్వర్ ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. జ్ఞానేశ్వర్ కుటుంబసభ్యులు వ్యక్తిగత పనులపై ఇంటికి తాళంవేసి హైదరాబాద్‌కు వెళ్లారు. గమనించిన దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న రూ.2లక్షల నగదు, 4 తులాల బంగారం అపహరించారు. మొత్తంగా రూ.4.5 లక్షల సొత్తు చోరీకి గురైంది. శుక్రవారం ఉదయం ఇంటి తాళం పగలగొట్టి ఉండడాన్ని స్థానికులు గమనించి జ్ఞానేశ్వర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. జ్ఞానేశ్వర్ పోలీసులకు సమాచారం అందించడంతో దేవరకొండ సీఐ నర్సింహులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేస్తున్నారు. దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఉద్యోగ, ఉపాధి శిక్షణ తరగతులకు దరఖాస్తుల ఆహ్వానం

భూదాన్‌పోచంపల్లి, జూన్7 : యదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పూర్ గ్రామానికి చెందిన స్వామిరామానందతీర్థ గ్రామీణ సంస్థ (ఎస్ఆర్‌టీఆర్ఐ)లో యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి ఆధారిత శిక్షణా తరగతులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి తెలిపారు. రాష్ట్రప్రభుత్వం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణా వివరాలను సంస్థ కార్యాలయంలో శుక్రవారం విలేకరులకు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా దీన్‌దయాళ్‌ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన ద్వారా ఉపాధి ఆధారిత సాంకేతిక శిక్షణా కార్యక్రమాలకు అర్హత, ఆసక్తి గల గ్రామీణ ప్రాంత అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. మూడున్నర నెలల కాలపరిమితి ఉన్న ఇంటర్మీడియట్ పాస్ అర్హత కలిగిన వారికి డాటా ఎంట్రీ ఆపరేటర్ - ఎంఎస్ఆఫీస్, కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్ కోర్సులు, అదేవిధంగా బీకామ్ అర్హత కలిగిన వారికి అకౌంట్స్ అసిస్టెంట్(ట్యాలీ), నాలుగు నెలల కాలపరిమితి గల పదో తరగతి పాసైన వారు సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్ కోర్సుకు, ఐదు నెలల కాలపరిమితికి పదో తరగతి పాస్/ ఐటీఐ అర్హత గల వారు ఎలక్ట్రిషియన్(డెమెస్టిక్) కోర్సుకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా నాలుగు నెలల కాలపరిమితికి సోలార్ సిస్టమ్ ఇన్‌స్టాలేషన్, సర్వీస్ కోర్సుకు పదో తరగతి పాస్/ఐటీఐ ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. 18-30 ఏళ్ల వయసు, గ్రామీణ అభ్యర్థులై ఉండాలన్నారు. చదువు మధ్యలో ఉన్నవారు అనర్హులన్నారు. అర్హతల వారు ఒరిజినల్ సర్టిఫికేట్స్, జిరాక్స్ సెట్, పాస్‌పోర్టుసైజు ఫొటో, ఆధార్ కార్డు, రేషన్ కార్డు కలిగి ఉండాలన్నారు. ఉచిత శిక్షణ, భోజన వసతితో పాటు ఉద్యోగం అవకాశం కల్పిస్తామన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ దరకాస్తులను సంస్థలో ఈ నెల 12లోగా అందజేయాలని ఆమె కోరారు.

జంట నగరాలకు నిరంతరం నీటి సరఫరా

పెద్దఅడిశర్లపల్లి, జూన్ 7: ఏఎమ్మార్ ప్రాజెక్టు పుట్టగండి ఎత్తిపోతల పథకం నుంచి జంటనగరాలకు అంతరాయం లేకుండా నిరంతరం నీటి సరఫరాకు తగిన చర్యలు తీసుకుంటున్నామని టీజీ జెన్‌కో సీఈ వి.మహేష్‌కుమార్ తెలిపారు. నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని సాగర్ బ్యాక్‌వాటర్ పుట్టగండి జీరో పాయింట్ వద్ద జలమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అత్యవసర మోటార్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అప్రోచ్ కెనాల్‌లో కనిష్ఠ నీటిమట్టం 510 అడుగులకు తగ్గకుండా చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులకు సూచించారు. అప్రోచ్ కాల్వలు నీటి సరఫరాను అడ్డుకోకుండా చెట్లను తొలగించాలన్నారు. స్థానిక జెన్‌కో ఇంజనీర్లు అప్రమత్తంగా ఉండి నిరంతరం 800 క్యూసెక్కుల నీటి సరఫరాకు అవాంతరాలు కలగకుండా చూడాలన్నారు. అనంతరం పుట్టగండి పంప్‌హౌస్‌ను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. ఆయన వెంట టీజీజెన్‌కో ఎస్ఈ రఘురాం, డీఈలు నరేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రవీణ్, శ్రీదర్, బాల్‌రెడ్డి, ఏడీఈలు సుదాకర్, సంజీవరెడ్డి, సత్యనారాయణ, సిబ్బంది శిరీష ఉన్నారు.



పుట్టగండి జీరో పాయింట్ వద్ద గల అత్యవసర మోటార్లను పరిశీలిస్తున్న టీజీజెన్‌కో సీఈ మహేష్‌కుమార్

భైరవునిపల్లిలో వివాహిత హత్య


నేలకొండపల్లి, జూన్ 7 : ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల పరిధిలోని భైరవునిపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి దారుణం చోటుచేసుకుంది. వివాహితను గ్రామానికే చెందిన శొంఠి శ్రీను అనే వ్యక్తి కత్తితో పొడిచి దారుణంగా హత్యచేశాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కోళ్ల సైదమ్మ(45)కు కోదాడ మండలం కట్టకొమ్ముగూడేనికి చెందిన బూర సైదులుతో వివాహమైంది. వీరికి ఇరువురు కుమారులు. కాగా గత కొన్ని సంవత్సరాలుగా సైదమ్మ భర్తకు దూరంగా ఉంటూ సూర్యాపేట జిల్లా కోదాడలోని ఓ ప్రైవేటు కళాశాలలోని బాలికల హాస్టల్‌లో పనిచేస్తోంది. శుక్రవారం రాత్రి సైదమ్మ కోసం కాపు కాసిన శ్రీను, సైదమ్మ ఆమె ఇంటి సమీపంలోనే మాంసం నరికే కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. దాడిలో సైదమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహంపై దాదాపు 11 వరకు కత్తి పోట్లు ఉన్నట్లుగా సమాచారం. మృతదేహాన్ని నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించారు. హత్య చేసిన శ్రీను పరారీలో ఉన్నాడు. శ్రీను స్వస్థలం సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం కాగా 30 ఏళ్ల క్రితమే భైరవునిపల్లికి వలస వచ్చి చికెన్ షాపు నిర్వహిస్తున్నాడు. కాగా నేలకొండపల్లి పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి, పంచనామా నిర్వహించారు. నిందితుడి కోసం గాలిస్తున్నారు. సైదమ్మ బంధువులు నిందితుడి ఇంటిపైకి వెళ్లి సామాన్లు బయటవేశారు. అదే సమయానికి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కాగా హత్యకు గల కారణాలు తెలియరాలేదు. నాలుగు రోజులుగా నిందితుడు సైదమ్మ కోసం కాపు కాస్తున్నట్లు సమాచారం. వివాహేతర సంబంధాలే కారణం కావచ్చని తెలుస్తోంది.



బూర సైదమ్మ(ఫైల్)

జీవితంపై విరక్తి చెంది మహిళ ఆత్మహత్య

మోతె, జూన్ 7: సూర్యాపేట జిల్లా మోతె మండలం సిరికొండలో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఏఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం సిరికొండ గ్రామానికి చెందిన ఎలుగు ఉపేంద్ర(32) భర్త ఏడేళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. వీరికి కుమార్తెలు శ్రీవల్లి, శ్రీవాణిలు ఉన్నారు. కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఉపేంద్ర అత్తామామలు వృద్ధులు కావడంతో కుటుంబ భారం ఒక్కదానిపై పడింది. జీవనోపాధి కోసం నిత్యంఇబ్బందులు పడుతోంది. తమ్ముడుకు నాగరాజుకు తన కుటుంబసమస్యలు చెప్పుకుంటూ రోజు బాధపడుతోంది. తమ్ముడు మనోధైర్యం చెబుతుండేవాడు. జీవితంపై విరక్తి చెందిన ఉపేంద్ర ఇంట్లో ఉన్న క్రిమిసంహారక మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందింది. చిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయి చిన్నారులు, ఇంటి బాధ్యతలు మోస్తున్న కోడలు మృతి చెందడంతో వృద్ధదంపతులు కన్నీరుమున్నీరయ్యారు. తమ్ముడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.



ఉపేంద్ర(ఫైల్)

చిత్తడిగా మారిన గాంధీనగర్ దారి



గాంధీనగర్‌లో ఇళ్ల మధ్యలో నిలిచిన నీరు

కట్టంగూరు: కట్టంగూరు గ్రామపంచాయతీ పరిధిలోని గాంధీనగర్ (జంగాల కాలనీ) ఇటీవల కురిసిన వర్షాలకు కాలనీకి వెళ్లే రహదారి చిత్తడిగా మారింది. దీంతో పాటు కాలనీకి వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లు రహదారికి అడ్డంగా ఏపుగా పెరగడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కాలనీలో 60కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే ప్రజాప్రతినిధులు హామీలు ఇస్తున్నారు తప్ప ఎలాంటి రోడ్లు, వసతులు కల్పించడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కాలనీ మొత్తం జలమయమైంది. ఇళ్ల మధ్యనే నీరు నిల్వ ఉండి దుర్వాసనతో పాటు ప్రజలు రోగాల బారినపడే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తమకాలనీని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వర్షం వస్తే అంతే...



గుంతలమయంగా మారిన శివన్నగూడెం- మేటిచందాపురం రోడ్డు

మర్రిగూడ: మండలంలోని పలు గ్రామాల్లోకి వెళ్లే అనుసంధాన రోడ్లన్నీ మరమ్మతులు నోచుకోలేదు. దీంతో వర్షం వస్తే చాలు రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి. రెండు రోజులుగా మర్రిగూడ మండలంలో కురుస్తున్న వర్షాలకు శివన్నగూడెం నుంచి మేటిచందాపురం, ఇందుర్తి, కొట్టాల, నామాపురానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్లు మరమ్మతుకు నోచుకోక ప్రయాణికులకు ప్రమాదకరంగా మారాయి. ముఖ్యంగా శివన్నగూడెం నుంచి నామాపురం వెళ్లే రోడ్డు వర్షాలకు రోడ్లు గుంతలమయంగా మారింది. అధికారుల నిర్లక్ష్యం వల్ల రోడ్డు మరమ్మతులకు నోచుకోలేక ప్రయాణికులు, బాటసారులు, ద్విచక్రవాహనదారులు గుంతలలో పడి ప్రమాదానికి గురవుతున్నారు. అధికారులు స్పందించి అధ్వానంగా తయారైన రోడ్లన్నింటినీ మరమ్మతు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రాంగణాల్లో సౌకర్యాలు శూన్యం



కోరుట్లలో నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణం

చందంపేట: తెలంగాణలో గ్రామీణ ప్రాంతాలలోని క్రీడల నిర్వాహణకు గత ప్రభుత్వం లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు ఏమాత్రం ఉపయోగపడటం లేదు. క్రీడాప్రాంగణాలు అలంకారప్రాయంగా బోర్డులకే పరిమితమయ్యాయి. వాటిల్లో మౌలిక సదుపాయాలు, కనీస క్రీడా సామగ్రి కూడా మచ్చుకైన కానరావడం లేదు. కొన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు గ్రామానికి దూరంగా ఉండటంతో ఆటలకు అనుకూలంగా లేవనే విమర్శలు వస్తున్నాయి. గత ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసి కాంట్రాక్టర్ల జేబులు నింపిందనే విమర్శలు ఉన్నాయి. కొన్నిచోట్ల బోర్డులు ఏర్పాటుచేసి వదిలేశారు. క్రీడా ప్రాంగణాలపై ప్రభుత్వం దృష్టిసారించి మౌలికవసతులు కల్పించాలని, తద్వారా గ్రామాల్లోని క్రీడాకారులకు ప్రయోజనకరంగా ఉంటుందని పలువురు కోరుతున్నారు.

అధ్వానంగా పీఏపల్లి రోడ్డు



అధ్వానంగా తయారైన అంగడిపేట - పీఏపల్లి రహదారి

పెద్దఅడిశర్లపల్లి: పీఏపల్లి మండల కేంద్రం నుంచి జాతీయ రహదారి జడ్చర్ల- కోదాడకు 5 కిలోమీటర్లు దూరం ఉంటుంది. కానీ అడుగడుగునా గుంతలే ఉన్నాయి. ఐదు కిలోమీటర్ల ప్రయాణం అర్ధగంట పడుతుందంటే రోడ్డు ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతిని రోడ్డు పొడవునా గుంతలు ఏర్పడి అధ్వానంగా తయారైంది. పగటి వేళలో ఎలా ఉన్నా.. రాత్రిపూట ఈ దారిలో ప్రయాణించేవారు ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. అంతేకాకుండా గుంతల రోడ్డుపై నిత్యం ప్రయాణాలు సాగించడం ద్వారా వెన్నుపూస, నడుంనొప్పి వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

బంగారు మైసమ్మ తల్లి ఆలయ

వేలం ఆదాయం రూ.26.72 లక్షలు

దామరచర్ల, జూన్ 7: మండలంలోని కల్లెపల్లి గ్రామంలో శ్రీ బంగారు మైసమ్మ తల్లి దేవస్థానంలో ఒక సంవత్సరం కాలపరిమితి వరకు వివిధ హక్కుల కోసం నిర్వహించిన బహిరంగ వేలంలో రూ. 26.72 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి గుజ్జుల కొండారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆలయ ఆవరణలో వివిధ హక్కుల కోసం మిర్యాలగూడ డివిజన్ పరిశీలకుడు రమేష్ సమక్షంలో వేలం నిర్వహించారు. కొబ్బరికాయలు అమ్ముకోవడానికి రాళ్లవాగు తండాకు చెందిన ధీరావత్ పున్నానాయక్ రూ.17.80 లక్షలకు దక్కించుకోగా, పూల విక్రయానికి కల్లేపల్లికి చెందిన మాలోతు బీమానాయక్ రూ.2.22 లక్షలు, లడ్డూ ప్రసాదం విక్రయానికి కల్లేపల్లికి చెందిన మాలోతు రవినాయక్ రూ.6.70 లక్షలకు దక్కించుకున్నారు. దీంతో ఆలయానికి వేలం ద్వారా రూ.26.72లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా దున్నపోతులు సమకూర్చుకునే హక్కు, కొబ్బరిచిప్పలు, తలనీలాలు సేకరించుకునే హక్కులకు గతేడాది కంటే తక్కువ పాట వచ్చినందున ఆ వేలాన్ని ఈ నెల 14వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఎస్ఐ రవి ఆలయం వద్ద బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో భీమా, సోమమ్మ, జానకిరాములు, మాజీ సర్పంచ్ మాలోతు జనార్ధన్, ఎంపీటీసీ శారదపాచ్యనాయక్, నెహ్రూనాయక్, డి.వెంకటేశ్వర్లు, రామ్మోహన్, కోటేష్, ఎర్రనాయక్, హజ్మీరా, లింగానాయక్, మేఘూ, వాగ్యా, ధీరావత్ లింగానాయక్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేయాలి

చందంపేట, జూన్ 7: అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. చందంపేట మండలం గన్నెర్లపల్లి గ్రామంలో శుక్రవారం అమరజీవి పల్లా జనార్ధన్‌రెడ్డి స్తూపాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. అమరుల ఆశయ సాధన కోసం ఎర్రజెండా అండతో పోరాటాలు ఉధృతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పాందురంగారెడ్డి, వెంకటయ్య, వెంగలయ్య, కృష్ణయ్య, పర్వతాలు పాల్గొన్నారు.

రైతు భరోసా హామీని అమలుచేయాలి

చండూరు, జూన్ 7: ఎన్నికల ముందు తెలంగాణ రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన రైతు భరోసా హామీని తక్షణమే అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు ఉజ్జిణి రత్నాకర్‌రావు డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైనప్పటికీ నేటికీ రూ.2లక్షల రుణమాఫీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. మార్కెట్‌లో విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తూ రైతుల సొమ్మును దోచుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి ఎరువులు, విత్తనాలతో పాటు రైతు భరోసా పథకం కింద ఇస్తానన్న రూ.2లక్షలు తక్షణమే మాఫీ చేసి తిరిగి పెట్టుబడి సహాయాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు నలపరాజు రామలింగయ్య, మండల కార్యదర్శి నలపరాజు సతీష్‌కుమార్, నాయకులు జెల్ల శ్రీను, చెడుబుద్ధి ఊశయ్య, పరమేష్, నెల్లికంటి శంకర్ పాల్గొన్నారు.

జిల్లా శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

నల్లగొండరూరల్, జూన్ 7: కుల వివక్ష పోరాట సమితి (కేవీపీఎస్) జిల్లా శిక్షణ తరగతులు జూన్ 26, 27వ తేదీల్లో జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కా ర్యదర్శి పాలడుగు నాగార్జున తెలిపారు. పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవనం లో శుక్రవారం జరిగిన కేవీపీఎస్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో సంక్షేమ హాస్టళ్లు సమస్యల నిలయంగా మారాయని అన్నారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన పిల్లలకు ప్రభుత్వం అందించే విద్య వారికి అందని ద్రాక్షగా మారిందన్నారు. పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కేవీపీఎస్ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించి, విద్య అందే వరకు పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీను, శివకుమార్, మల్లన్న, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వంగూరి వెంకన్నకు సేవారత్న నేషనల్ అవార్డు

నల్లగొండ టౌన్ జూన్ 7: ఏఎమ్మార్పీ పుట్టంగండి ప్రాజెక్టు అసిస్టెంట్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న, ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ అసోసియేషన్ రీజనల్ ప్రెసిడెంట్ వంగూరి వెంకన్న సేవారత్న అవార్డుకు ఎంపికయ్యారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవడం కోసం బహుజన సాహిత్య అకాడమీ వారు ప్రతి ఏటా ప్రజా ఉద్యమాలకు, సంఘ సేవకులకు, రచయితలకు, కవులకు, స్వచ్ఛంద సంస్థలకు ప్రతి ఏటా సేవారత్న అవార్డులను అందజేయనున్నారు. ఈ ఏడాది వంగూరి వెంకన్నను ఎంపిక చేశారు. ఈ నెల 10న మహారాష్ట్రలోని పూణెలో నిర్వహించనున్న సమావేశంలో అవార్డును అందజేయనున్నారు.

ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషి : జైవీర్‌రెడ్డి

తిరుమలగిరి(సాగర్), జూన్ 7: ప్రభుత్వ విద్యను బలోపేతానికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని నెల్లికల్ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో ఆయన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డితో కలిసి పాల్గొన్నారు. నెల్లికల్ జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందు తుందని, తమ పిల్లలను ఆయా పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, సౌకర్యాల మెరుగుదల కోసం తాను కృషి చేస్తానన్నారు. అదేవిధంగా ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా, ప్రభుత్వ పాఠశాలల్లో సబ్జెక్ట్ కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. పాఠశాలల పునః ప్రారంభానికి ముందే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్‌చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, ఎంఈవో తరి రాము, ఎంఎన్‌వో కె.శ్రీనివాస్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం, ఉపాధ్యాయులు వడ్త్యా రాజు, కట్టెబోయిన సైదులు, శ్రీదేవి, కృష్ణవేణి, ఎరనాగుల సైదులు, శైలజ, మంగ, అరుణకుమారి, రాజేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

బడిబాట కార్యక్రమం విజయవంతం చేయాలి

మునుగోడు: మునుగోడులోని పాఠశాలల ఉపాధ్యాయులు శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సౌకర్యాలు ఉన్నాయని, బడీఈడు పిల్లలను బడికి పంపాలని కోరుతూ గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలకు పంపితే ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు కోరారు.

ముగిసిన సమ్మర్ స్పెషల్

బ్యాడ్మింటన్ కోచింగ్ క్యాంపు

నల్లగొండ టౌన్, జూన్ 7: నెల రోజులుగా స్థానిక ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి పంచాయతీరాజ్ ఎస్‌ఈ తిరుపతయ్య, జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి మక్బూల్‌అహ్మద్ హాజరై శిక్షణ పూర్తి చేసుకున్న క్రీడాకారులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరం నిర్వహణకు సహకరించిన వారిని అభినందించారు. క్రీడాకారులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని మున్ముందు క్రీడల్లో రాణించాలని కోరారు. అనంతరం క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని అందచేశారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ పట్టణ ప్రధాన కార్యదర్శి పంతులు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యారాల ప్రభాకర్‌రెడ్డి, బ్యాడ్మింటన్ పట్టణ అధ్యక్షుడు యాట గోవర్ధన్‌రెడ్డి, విశ్రాంత ఐఏఎస్ చోల్లేటి ప్రభాకర్, శ్రీధర్‌రెడ్డి, బండారు రమేష్, హేమంత్, పంతులు మురళి కోచ్ ప్రకాష్‌నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఆధ్యాత్మిక శోభ

దేవరకొండ, కనగల్, మునుగోడు రూరల్, వేములపల్లి, జూన్ 7: జిల్లాలో శుక్రవారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. జిల్లాలోని పలు ఆలయాల్లో వైభవంగా కల్యాణాలు నిర్వహించారు. వేద పండితులతో మంత్రోచ్చారణ నడుమ కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

● చింతపల్లి మండల కేంద్రంలోని షిర్డీ సాయిబాబా దేవాలయంలో వార్షిక ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమైనట్లు ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనంజయ్య తెలిపారు. శుక్రవారం బ్రహ్మశ్రీ కొడగొండ్ల శ్రీరామ శరణ్‌శర్మ ఆధ్వర్యంలో గోమాతలకు పూజలు చేసి ఉత్సవాలు ప్రారంభించారు. ఆదివారం వరకు వేడుకలు అంగరంగ వైభవంగా చేపట్టనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా భోజనంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించారు.

● కనగల్ మండలంలోని బుడుమర్లపల్లి గ్రామంలో గల శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వేదపండితులు నవగ్రహ మండల పూజలను వైభవంగా నిర్వహించారు. ఉదయం గణపతిపూజ, పుణ్యాహవాచనం జరిగాయి. అభిషేకాలు, హోమపూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



చింతపల్లి సాయిబాబా ఆలయంలో హోమం నిర్వహిస్తున్న వేదపండితులు



మునుగోడు : జమస్తాన్‌పల్లిలో నిర్వహించిన కల్యాణంలో పాల్గొన్న భక్తులు

● మునుగోడు మండలంలోని జమస్తాన్‌పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామాంజనేస్వామి దేవాలయంలో సీతారాముల స్వాములకు కల్యాణం నిర్వహించారు. పూజల్లో గ్రామ మాజీ సర్పంచ్ పంతంగి పద్మస్వామిగౌడ్, మునుగోడు మాజీ కోఆప్షన్ సభ్యుడు పాలకూరి నరసింహగౌడ్, గ్రామస్థులు స్వామిగౌడ్, యాదగిరి, అంజయ్య, శంకర్, సైదులు పాల్గొన్నారు.

● వేములపల్లి మండలంలోని రావులపెంట గ్రామంలో బీమారం- సూర్యాపేట ప్రధాన రహదారిపై గల శ్రీలక్ష్మీ తిరుపతమ్మగోపయ్య స్వామి కల్యాణ మహోత్సవాన్ని వేద పండితుల సమక్షంలో మంగళవాయిద్యాల నడుమ అమ్మవారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులందరూ బోనాలు అమ్మవారికి సమర్పించారు. కోలాటాలతో అమ్మవారి ఊరేగించారు. అమ్మవారి కల్యాణ మహోత్సవానికి మండలంతో పాటు సమీప మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నంద్యాల శ్రీరాంరెడ్డి, మాజీ సర్పంచ్ దొంతిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు జిన్నా నాగిరెడ్డి, అవిరెండ్ల వేణు, శీలం శ్రీనివాస్, పిండి సతీష్, శీలం జగన్, రాము పాల్గొన్నారు.

ఐదేళ్ల పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించాలి

మర్రిగూడ, దేవరకొండ, జూన్ 7: ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని చింతపల్లి ఐసీడీఎస్ సీడీపీవో లావణ్యకుమారి అన్నారు. జిల్లాలోని మర్రిగూడ మండలం మర్రిగూడ, కొండూరు, దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామాల్లో శుక్రవారం అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో లావణ్యకుమారి మాట్లాడుతూ తల్లిదండ్రుల తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రానికి పంపిస్తే పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ యశోద, అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, విమలాదేవి, లక్ష్మి, చిన్నపిల్లల తల్లులు, ఆయాలు పాల్గొన్నారు.

● దేవరకొండ మండలంలోని మైనంపల్లిలో ఎంపీటీసీ కొర్ర గౌతమిరాంసింగ్ మాట్లాడుతూ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంబేడ్కర్, అంగన్‌వాడీ టీచర్ కమలమ్మ, ఆయా కలమ్మ, ఆశావర్కర్ ధనమ్మ, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

గోదాంలో అసోసియేషన్ లారీలను పెట్టాలి

మాడ్గులపల్లి, జూన్ 7: మండలంలోని కుక్కడం గ్రామంలోని లక్ష్మీనరసింహ వేర్ హౌజ్ గోదాంలో మిర్యాలగూడ అసోసియేషన్ లారీలను లోడింగ్ పెట్టి తమను ఆదుకోవాలని ది మిర్యాలగూడ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మర్రి సురేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన గోదాం యాజమాన్యానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము గత 40 సంవత్సరాలుగా ఒక యూనియన్‌ను ఏర్పాటు చేసుకొని జీవనోపాధి కోసం తమ లారీలను సీరియల్ విధానంలో లోడింగ్ పంపుతున్నామని, కరోనా సమయంలో సైతం తాము లక్ష్మీనరసింహ వేర్ హౌజ్ గోదాంలో తమ ప్రాణాలను లెక్క చేయకుండా సరుకులను మిర్యాలగూడ గూడ్స్ షెడ్‌కు తరలించామని అన్నారు. కానీ ప్రస్తుతం బయటి లారీలతో గోదాంలో పత్తి, ఇతర లోడ్లుగా తోలుకుంటుండటంతో తమ జీవనోపాధికి ఆటంకం ఏర్పడుతుందన్నారు. ఇప్పటికైనా గోదాంలో సరుకులను తమ లారీల ద్వారా లోడింగ్ పెట్టి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో అత్తూరి నవీన్‌కుమార్, రాంభద్రరెడ్డి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

జూలై 7న మాదిగల ఆత్మగౌరవ కవాతు

నల్లగొండటౌన్, జూన్ 7: వరంగల్ జిల్లా కేంద్రంలో వచ్చే నెల 7వ తేదీన వరంగల్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న మాదిగల ఆత్మగౌరవ కవాతును జయప్రదం చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం మాదిగ అధ్యక్షతన నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 30 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. మందకృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా వరంగల్ గడ్డపై లక్షలాదిమంది మాదిగ యువకులతో మాదిగల ఆత్మగౌరవ కవాతును నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మాదిగల ఆత్మగౌరవ కవాతును జయప్రదం చేయడం కోసం ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, అనుబంధ సంఘాల నాయకులు గ్రామస్థాయి ఎమ్మార్పీఎస్ కమిటీలను యువకులతో నిర్మాణం చేసుకొని మాదిగల ఆత్మగౌరవ కవాతుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జూలై 7వ తేదీన జరిగే మాదిగల ఆత్మగౌరవ కవాతు మాదిగల ఐక్యతను ప్రపంచానికి చాటే విధంగా ఘనంగా ఉండాలని ఆ లక్ష్యంగా మాదిగలంతా సిద్ధపడాలని అన్నారు. సమావేశంలో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంపెల్లి బిక్షపతి, ఎమ్మెస్పీ రాష్ట్ర నాయకులు మచ్చ ఏడుకొండలు, మేడి శంకర్, కొమిరె స్వామి, నాయకులు మడుపు శ్రీనివాస్, బొజ్జ చిన్న మాదిగ, పోలేని యాదయ్య, కురుపాటి కమలమ్మ, పెరిక శ్రీనివాసులు, కొత్త వెంకన్న, కందుల మోహన్, దుబ్బ సత్యనారాయణ, సంద్ర నాగరాజు, దైద రవి, మాసారం వెంకన్న, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నల్లగొండ స్పోర్ట్స్, జూన్ 7: వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీవైఎస్‌వో మక్బూల్‌అహ్మద్ అన్నారు. పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో 30రోజుల పాటు నిర్వహించిన తైక్వాండో సమ్మర్ క్యాంపు శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వేసవిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. శిబిరంలో నేర్చుకున్న క్రీడా నైపుణ్యాలను ప్రతీరోజు తర్ఫీదు పొందాలని సూచించారు. శిక్షణ పొంది ప్రతిభ కనబర్చిన విద్యార్థులందరికీ సర్టిఫికెట్లతో పాటు బెల్టులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా తైక్వాండో సెక్రటరీ యాక స్వామి, ఎండీ నజీర్, నాగిరెడ్డి, శంకర్, లింగస్వామి, ప్రవీణ్, సిరి, ఉమేష్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డీవైఎస్‌వో మక్బూల్ అహ్మద్

సంక్షిప్త సమాచారం...

దేవరకొండ: దేవరకొండ డివిజన్‌లో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించకుండా అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్నారని విద్యార్థుల రాజకీయ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కేతావత్ బాబురాంనాయక్ ఆరోపించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేపట్టి అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్న విద్యా సంస్థలపై చర్య తీసుకోవాలని ఆయన కోరారు.

వేములపల్లి: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి తండ్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మాలి సత్తిరెడ్డి ఇటీవల మృతిచెందాడు. ఆయన కుటుంబసభ్యులను శుక్రవారం మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన సత్తిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు చిరుమర్రి కృష్ణయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు రావు ఎల్లారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్టల కృపయ్య, గంజి శ్రీనివాస్, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు దైద ధర్మయ్య మృతి చెందగా ఆయన కుటుంబసభ్యులను డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ పరామర్శించారు. ఆయన వెంట డీసీసీ ఉపాధ్యక్షుడు రావు ఎల్లారెడ్డి, నాయకులు పుట్టల పెదవెంకన్న, కొమ్ము వెంకన్న, శ్రీనివాస్, వినోద్, మహేందర్‌రెడ్డి, గిరి పాల్గొన్నారు.

చిట్యాల: చిట్యాలలోని పోతరాజు చెరువును పునరుద్ధరించాలని సీపీఐ మండల కార్యదర్శి ఎండీ అక్బర్ కోరారు. చెరువులో చెత్తను డంపింగ్ చేయడం ఆపాలని, చెరువును పునరుద్ధరించి నీటి వనరులను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఎస్‌కే షరీఫ్, దేశగోని బాలరాజు, గుండాల సత్తయ్య, నామనంది అంజయ్య పాల్గొన్నారు.

చండూరు: చండూరు పట్టణానికి చెందిన ఎర్రజెల్ల రాములు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో, చండూరు మాజీ సర్పంచ్ కలిమికొండ జనార్ధన్ రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు.

హాలియా: నాగార్జునసాగర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డిలు పర్యటించనున్నట్లు తెలిపారు. నాయకులు, పార్టీ కార్యకర్తలు హాజరై పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

నల్లగొండ టౌన్: ఎంపీగా ఎన్నికైన కంగనారనౌత్‌పై హిమాచల్ ప్రదేశ్‌లో ఓ మహిళా కానిస్టేబుల్ దాడి చేయడాన్ని డ్వాబ్ ప్రధాన కార్యదర్శి పొనుగోటి చొక్కారావు తీవ్రంగా ఖండించారు. ఇలాంటి వారిపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.



మునుగోడు: మునుగోడుకు చెందిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కైలాష్‌నేత ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ, భువనగిరి ఎంపీలుగా గెలుపొందిన కుందూరు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి లను హైదరాబాద్‌లోని వారి నివాసంలో వేర్వేరుగా కలుసుకున్నారు. మర్యాద పూర్వకంగా కలిసి వారికి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో ఘ నంగా సన్మానించారు. జిల్లా అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం కృతనిశ్చయంతో పనిచేయాలని కోరారు.

పెద్దఅడిశర్లపల్లి, కనగల్: సకాలంలో ఏకరూప దుస్తువులు అందించడం అభినందనీయమని ఎంఈవో తరి రాములు అన్నారు. పెద్దఅడిశర్లపల్లి, కనగల్ మండలకేంద్రాల్లో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏకరూప దుస్తువులు కుట్టడం పూర్తికావడంతో ఎమ్మార్సీ కార్యాలయాల్లో ఎంఈవోకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ సమష్టి సహకారంతో విద్యార్థులకు ఏకరూప దుస్తువులు తయారు చేసి ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో నాలుగు గేదెలు మృతి

దామరచర్ల, తిప్పర్తి, జూన్ 7: విద్యుదాఘాతంతో నాలుగు పాడి గేదెలు మృతి చెందాయి. ఈ సంఘటనలు దామచర్ల, తిప్పర్తి మండలాల్లో శుక్రవారం చోటు చేసుకుంది.

● దామరచర్ల గ్రామానికి చెందిన మోదాల రాంమల్లి, నిమ్మల లింగయ్య, అప్పనబోయి న శ్రీనులకు చెందిన మూడు గేదెలు మేత కోసం గ్రామ శివారులోకి వెళ్లాయి. మేత మేస్తుండగా విద్యుత్ తీగలు వాటికి తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాయి. దీంతో తమకు రూ.2.5లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరారు.

● తిప్పర్తి మండలంలోని రామలింగాలగూడెం గ్రామానికి చెందిన వనపర్తి కృష్ణయ్య అనే రైతు తనకు ఉన్న నాలుగు పాడి గేదెలను మేపడానికి వ్యవసాయ పొలాల వైపు తోలుకెళ్లాడు. అదే గ్రామానికి చెందిన వనపర్తి బుచ్చయ్య అనే రైతు పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న ఎర్త్ వైర్ ఓ గేదె తగిలింది. దీంతో విద్యుఘాతానికి గురై ఓ గేదె అక్కడికక్కడే మృతి చెందినది. తన గేదె మృతి చెందడంతో రూ. 50 వేలకు పైగా తాను నష్టపోయినట్లు రైతు తెలిపారు.

బెల్లంపానకం ధ్వంసం

చందంపేట, జూన్ 7: చందంపేట మండలంలోని మానావత్‌తండా, పాత్లావత్‌తండాలలో శుక్రవారం నల్లగొండ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ కిషన్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. 500 లీటర్ల బెల్లం పానకం, 5 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ నాటుసారా తయారుచేస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన సారా నిర్మూలన కార్యక్రమంలో ప్రజలు సహకరించాలని కోరారు. నల్లబెల్లం, పటిక, నాటుసారా తయారీకి అవసరమైన ముడిసరుకు తరలించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్, నర్సింహ, వీరబాబు పాల్గొన్నారు.